క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



జి.కొండూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులను పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కేసీహెచ్ సూరిబాబు అన్నారు. చెవుటూరు గ్రామ శివారులోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ పద్ధతి ద్వారా సాగుచేసిన చిరు ధాన్యాల పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక సెంటు భూమిలో పెరిగిన చిరు ధాన్యాల పంట నుంచి ఎన్ని కిలోల పచ్చిరొట్ట ఉత్పత్తి అవుతుందో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ చిరుధాన్యాల పంటను పశువులు మేసిన తర్వాత భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరుగుతుందని ఏఓ వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు

మునునూరు: ట్రిపుల్ ఐటీ సీట్ల సాధనలో బాలికల గురుకుల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ముసునూరులోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యార్థినులు కె.సాయిసింధు 578 మార్కులు, ఎం.జెస్సికా క్రిస్టల్ 569, ఎం.రాహిణి 565 మార్కులతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఎం.ప్రియాంక 571 ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ సీటు, టి.సాహితి 571, టి.ఐశ్వర్య 569 మార్కులతో ఒంగోలు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి బుధవారం తెలిపారు.

సాయి లక్ష్మీప్రసన్నకు గోల్డ్ మెడల్స్



మైలవరం: మైలవరం మండలం పుల్లూరు పంచాయతీ శివారు కొత్తగూడెం గ్రామానికి చెందిన ఉల్లిబోయిన శ్రీకాంత్ సతీమణి దేశబోయిన సాయి లక్ష్మీ ప్రసన్న కృష్ణా యూనివర్సిటీ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగంలో రెండు గోల్డ్ మెడల్స్ అందుకుంది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా బుధవారం ఈ అవార్డులను ఆమె అందుకుంది. ఆమెను గ్రామ పెద్దలు, గ్రామస్తులు అభినందించారు.

రేషన్ డీలర్లతో సమావేశం

తిరువూరు: నిత్యావసర సరుకులను రేషన్ డీలర్లు సజావుగా పంపిణీ చేయాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి కె.మాధురి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బుధవారం రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 30లోగా 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకు నిత్యావసర సరుకుల పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగిపై కౌన్సిలర్ ఆగ్రహం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ అధికారిపై ఓ వార్డు టీడీపీ కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేయడం సంచలనంగా మారింది. పాలకవర్గ సభ్యుల సమక్షంలోనే బుధవారం ఈ ఘటన జరగడంపై ఆ ఉద్యోగి మనస్థాపానికి గురయ్యాడు. సేకరించిన వివరాల ప్రకారం.. 2014-19న అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కొండపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని ఉద్యోగిని టీడీపీ కౌన్సిలర్ కోరాడు. నిబంధనల మేరకు మున్సిపల్ కమిషనర్ చెబితేనే బిల్లులు చేస్తామని ఉద్యోగి చెప్పడంతో ఆగ్రహానికి గురైన కౌన్సిలర్ అందరి ముందు ఇష్టమొచ్చినట్లు వ్యవహరించాడు. పాలకవర్గం బోర్డు ఏర్పడిన కొన్ని రోజుల్లోనే ఇలా ఉంటే ముందుముందు ఎలా వ్యవహరిస్తారో అనే ఆందోళన మున్సిపల్ ఉద్యోగుల్లో నెలకొంది. ఈ అంశంపై తేల్చుకునేందుకు ఉద్యోగులు ఓ సమావేశం ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిసింది.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ

నూజివీడు: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పట్టణ సీఐ పి. సత్యశ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ మత్తు పదార్థాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల శారీరకంగా, మానసికంగా హాని కలుగుతుందని, యువత బంగారు భవిష్యత్ నాశనమవుతుందని వివరించారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన

ఇబ్రహీంపట్నం: మాదక ద్రవాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి అన్నారు. మత్తు పదార్థాలతో అనర్థాలపై వాసవ్య మహిళా మండలి, ది లీవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని ఎంపీపీ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మత్తుకు బానిసలుగా మారిన వారికి డిఅడిక్షన్ సెంటర్లలో చికిత్స అందించే అవకాశం ఉందన్నారు. మాదక ద్రవ్యాల సమాచారాన్ని 1072 నంబర్‌కు అందించాలని సూచించారు.

చినుకుపడితే నరకమే!



అన్నవరం ఎస్సీ ఏరియాలో బురదగా ఉన్న అంతర్గత రహదారి



ఎస్సీ ఏరియాలో మురుగుతో నిండి ఉన్న డ్రెయినేజీ

- అభివృద్ధికి నోచుకోని అంతర్గత రహదారులు
- అధ్వానంగా అన్నవరం ఎస్సీ ఏరియా రోడ్లు
- పూడికతీత లేని డ్రెయినేజీలు
- అన్నవరం ఎస్సీ ఏరియా ప్రజల ఇబ్బందులు

నూజివీడు: మండలంలోని అన్నవరం ఎస్సీ ఏరియాలో అంతర్గత రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి గ్రాంట్ల రూపంలోను, ఆర్థిక సంఘం నిధులు లక్షలాది రూపాయలు వస్తూనే ఉన్నా అంతర్గత రోడ్ల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఉపాధి హామీ పథకంలో సిమెంట్ రోడ్లు నిర్మించామంటూ గొప్పగా చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఈ కాలనీలో కేవలం ఒక్క వీధికి మాత్రమే సిమెంట్ రోడ్డు వేసి మమ అనిపించింది. ఎస్సీ ఏరియాలో వంద గృహాల వరకు ఉండగా, 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. మొత్తం ఏడు వీధులుండగా వీటిల్లో నాలుగు వీధుల్లో మాత్రమే సిమెంట్ రోడ్లు ఉండగా, మిగిలినవి బురదకయ్యలుగా మారాయి. పేరుకే సిమెంట్ రోడ్లు తప్పితే డ్రెయినేజీ అధ్వానంగా ఉంది. ఎక్కడి మురుగు అక్కడే నిలిచి ఉండటంతో దోమల ఉధృతి ఎక్కువై పగలు, రాత్రి అనే తేడా లేకుండా దాడి చేస్తుండటంతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. మట్టిరోడ్లు చినుకుపడితే చాలు రొచ్చురొచ్చుగా తయారై నడవడానికి కూడా వీలులేకుండా ఉంటున్నాయి. స్థానికులు చేసేదేమీ లేక రొచ్చుగా ఉన్న మట్టిరోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్కోసారి కాలుజారి మహిళలు, పిల్లలు, వృద్ధులు కిందపడిపోతున్నారు. రోడ్లను సిమెంట్ రహదారులుగా అభివృద్ధి చేయాల్సిన అధికారులు, పాలకులు ఏమాత్రం పట్టనట్టు వ్యవహరిస్తూ కాలం గడిపేస్తున్నారు. వీధి లైట్లు సరిగా వెలగక రాత్రి పూట స్థానికులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. గ్రామ కార్యదర్శి ఏనాడూ ఎస్సీ ఏరియాలోకి వచ్చి తాము పడుతున్న ఇబ్బందులను గమనించిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు.

చినుకుపడితే రోడ్లు రొచ్చురొచ్చు



అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయకపోవడంతో చినుకు పడితే చాలు రొచ్చురొచ్చుగా అవుతున్నాయి. ఈ రోడ్లపై నడవాలంటే సర్కస్‌ఫీట్లు చేయాల్సి వస్తోంది. ఎక్కడ జారిపడతామోనని ఆందోళనగా రోడ్డుపై నడుస్తున్నాం. ఇప్పటికైనా రోడ్లను అభివృద్ధి చేయాలి.

– జుజ్జవరపు సావిత్రి, అన్నవరం, నూజివీడు మండలం

పూడిక తీయడం లేదు



డ్రెయినేజీల్లో పూడిక తీయడం లేదు. అసలు పూడిక తీసి ఎన్ని సంవత్సరాలైందో కూడా చెప్పలేం. దీనివల్ల మురుగునీరు నిలబడి దోమలు ఉధృతమై జ్వరాల బారిన పడుతున్నాం. పూడిక తీసి కాలనీ పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– అముదాల నాగమణి, అన్నవరం, నూజివీడు మండలం

ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదు



మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నిమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. దీని వల్ల వర్షాకాలంలో వీధుల్లో రాకపోకలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధి హామీ పథకంలో సిమెంట్ రోడ్లు పోస్తున్నారన్నారే గాని మా రోడ్డును అభివృద్ధి చేయలేదు.

– చీలి రాజారావు, అన్నవరం, నూజివీడు మండలం

పథకాల సద్వినియోగంతో అభివృద్ధి

ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని గిరిజనులు అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ పేర్కొన్నారు. వికసిత్ భారత్.. గిరిజన సాధికారతలో భాగంగా మండలంలోని సిద్ధార్థ నగర్‌లో ధర్తి ఆబా జన్ భగిదరి అభియాన్ గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు సారా తయారీ జోలికి వెళ్లకుండా కష్టపడి పని చేసుకుంటూ పిల్లలను చదివించుకోవాలన్నారు. పనులు కావాలంటే ఉపాధి హామీ పథకం ద్వారా కల్పిస్తామని చెప్పారు. గ్రామంలో సిమెంట్ రోడ్లను, డ్రెయినేజీలను నిర్మిస్తామన్నారు. తహసీల్దార్ గగులోతు భద్రూనాయక్ మాట్లాడుతూ గిరిజనులు అటవీ హక్కుల చట్టం కింద ప్రభుత్వం అందజేసిన భూముల్లో పండ్లతోటలు సాగుచేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. అటవీ, ఎక్సైజ్, ఉపాధి హామీ, ఐసీడీఎస్, విద్యాశాఖ తదితర శాఖల అధికారులు ఆయా శాఖలలో అమలు చేస్తున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా మండలంలోని ముక్కొల్లుపాడు స్కూల్‌కు చెందిన విద్యార్థులు మద్యం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రదర్శించిన లఘు నాటిక గ్రామస్తులను ఆలోచింపచేసింది. లఘు నాటికను ప్రదర్శించిన ఆరుగురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహం కింద ఒక్కొక్కరికి రూ.500 ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్ అందజేశారు. గ్రామసభలో ఎంపీపీ ఆరేపల్లి శిరీష, సర్పంచి బాణావతు చిలకమ్మ, పశువైద్యాధికారి దుర్గాభవాని, అటవీ అధికారి హరగోపాల్, ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌కు పెరిగిన ఆదరణ

ప్రథమ ఇంటర్‌లో 50 మంది చేరిక



విద్యార్థినులకు పుస్తకాలు అందజేసిన హెచ్‌ఎం అనురాధ, అధ్యాపకులు

నూజివీడు: ప్రతి మండలంలో బాలికలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌కు ఆదరణ పెరిగింది. 2025–26 విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 50 మంది విద్యార్థులు చేరడం గమనార్హం. గత విద్యా సంవత్సరంలో ఎంపీసీ గ్రూపునకు చెందిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ గ్రూపునకు సంబంధించి మెరుగైన ఫలితాలను సాధించారని హెచ్‌ఎం అనురాధ పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులందరికీ బుధవారం పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలను అందజేశారు. ఈ హైస్కూల్ ప్లస్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయి. ఇక్కడ చేరిన విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను, రాతపుస్తకాలను, మధ్యాహ్న భోజనాన్ని అందించడమే కాకుండా అడ్మిషన్ ఫీజు లేదని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాల విలీనం వద్దని ఆందోళన

విస్సన్నపేట: విస్సన్నపేట బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూల్‌లో విలీనం చేయవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు నిర్వహిస్తుండగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో మోడల్ స్కూల్‌కు బదలాయించడం వలన దూరాభారమవుతుందని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తంచేశారు. కూలి పనులు చేసి జీవించే తాము పిల్లలను పాఠశాలకు పంపేందుకు చాలా ఇబ్బందికరంగా ఉన్నందున విలీనం రద్దు చేయాలని కోరారు. ఎంఈఓ సుధాకర్, ఎంపీడీఓ చిన్నరాట్నాలు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. తరగతుల విలీనం నిబంధనల మేరకే జరిగిందని, తల్లిదండ్రులు చెప్పిన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సీహెచ్ చిట్టిబాబు తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్లు కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమృత్ పథకంలో మంజూరైన పథకం అప్పట్లో ఎన్నికల నేపథ్యంలో నిలిచి పోయిందన్నారు. ఆ పథకానికి కొనసాగింపుగా ప్రస్తుతం ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటులో భాగంగా మరలా రూ.57.12 కోట్లకు అంచనాలు రూపొందించామని చెప్పారు. కృష్ణానది ఒడ్డున 471 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వెల్ నిర్మాణంతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 4 వేల కిలోలీటర్ల సామర్థ్యం గల ఐదు ఓవర్ హెడ్ ట్యాంకుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పా. ఈనెల 26 నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభించి జూలై 21న టెండర్ ఖరారు చేస్తామన్నారు. త్వరలో ఇంటింటి కుళాయి కల సాకారం అవుతుందని చెప్పారు. వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి మేలు

చాట్రాయి: ఏ పంటకైనా విత్తన శుద్ధి చేయడం ఎంతో మేలని వ్యవసాయాధికారి బి. శివశంకర్ అన్నారు. ఆరుగొలనుపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసేందుకు కిలో విత్తనాలకు 8 గ్రాముల సూడోమోనాస్ శిలీంద్ర నాశిని లేదా 4 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల తరువాత నారుమడి చల్లుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బీజామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు.

పని భారం తగ్గించాలి

చాట్రాయి: పని భారం తగ్గించాలని కోరుతూ గ్రామ సచివాలయ ఇంజినీర్ల అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఐదేళ్లు పూర్తయినా ప్రమోషన్లు ఇవ్వడం లేదని, పని భారాన్ని తగ్గించాలని కోరారు.

30 నుంచి సర్టిఫికెట్ కోర్సులు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం ఉచిత సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం తెలిపారు. ఫౌండేషన్ ఆఫ్ కంప్యూటర్స్, ఫండమెంటల్ ఆఫ్ కామర్స్ కోర్సులను ఈనెల 30 నుంచి ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు బోధిస్తామన్నారు. కోర్సు పూర్తి చేసిన అనంతరం సర్టిఫికేట్‌లు అందజేస్తారని చెప్పారు.


లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తిరువూరు: జూలై 7న తిరువూరు కోర్టు ఆవరణలో జరుగనున్న లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన కేసుల పరిష్కారానికి కక్షిదారులను ప్రోత్సహించాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిందూర అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో బుధవారం న్యాయవాదులు, పోలీసు, ఎక్సైజ్, రవాణా తదితర శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. కక్షిదారుల సమయం, డబ్బు వృథా కాకుండా లోక్ అదాలత్‌లో తమ వివాదాలను పరిష్కారం చేసుకోవచ్చని సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యతేజ, న్యాయవాదులు పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

ఆగిరిపల్లి: జూలై 5న నూజివీడులో జరుగనున్న మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ శుభశేఖర్ కక్షిదారులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం లోక్ అదాలత్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొన్ని సందర్భాల్లో ఇరువర్గాల వారు కేసులు పెట్టుకుని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతుంటారని, వారి ధనం, సమయం వృథా కాకుండా పరస్పర అంగీకారంతో జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకునే వీలుందని, కక్షిదారులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

జీఓ నంబర్ 5ని రద్దు చేయాలని వినతి



ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సచివాలయాల ఉద్యోగులు

చాట్రాయి: సచివాలయ ఉద్యోగుల బదిలీలపై జారీ చేసిన జీఓ నంబర్ 5ని సవరణ చేయాలని కోరుతూ మండల సచివాలయ ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వార్డు ఉద్యోగుల మాదిరిగా గ్రామ సచివాలయ ఉద్యోగులకు కూడా సొంత మండలంలో పనిచేయకూడదనే నిబంధనను రద్దు చేయాలని, క్యాడర్ వారీగా సీనియారిటీ జాబితాను విడుదల చేసి మెరిట్ ప్రాతిపదికన బదిలీలను పారదర్శకంగా అమలు చేయాలని, అంతర్ జిల్లా బదిలీ కోరుకునే ఉద్యోగులకు అవకాశం ఇవ్వాలని, రేషనలైజేషన్ ప్రక్రియలో మిగులు ఉద్యోగులకు భవిష్యత్‌పై స్పష్టత ఇవ్వాలని, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌తో ప్రమోషన్ చానల్ కల్పించాలని, రెండేళ్ల ప్రొబేషన్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని వారు కోరారు.

మురుగు సమస్యకు పరిష్కారం



వెలగలేరు శివారు కాలనీ వద్ద మురుగునీరు పోయేందుకు పూడిక తీస్తున్న పొక్లెయిన్

జి.కొండూరు: వెలగలేరు శివారు కాలనీలో మురుగు సమస్యపై 'సాక్షి' బుధవారం ప్రచురించిన 'మురుగుతో సహవాసం' కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. గ్రామ పంచాయతీ అధికారులు జేసీబీతో డ్రెయినేజీ పూడిక తీయించి కాలనీలో రోజుల తరబడి నిల్వ ఉన్న మురుగునీరు పోయేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. ఇది తాత్కాలికమే అయినప్పటికీ ప్రజలకు ప్రస్తుత వర్షాకాలంలో కొంతమేర ఉపశమనం కలుగనుంది. వైద్యాశాఖ అధికారులు సైతం కాలనీని సందర్శించి ఫీవర్ సర్వే చేశారు. పారిశుద్ధ్య చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత: సీఐ

ఇబ్రహీంపట్నం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీపేరుతో అరెస్ట్ వారెంట్ జారీ అయిందని, మీరు స్పందించకపోతే అరెస్ట్ చేస్తామని ఎవరైనా ఫోన్ చేస్తే స్పందించవద్దన్నారు. మీఫోన్ నంబర్ క్రిమినల్ కార్యకలాపాలకు లింగ్ అయిందని, విదేశాలకు కొరియర్‌లో పంపుతున్న ల్యాప్‌టాప్, పాస్‌పోర్టులు వంటి పార్సిల్స్‌లో మాదక ద్రవ్యాలు గుర్తించామని ఫోన్ చేస్తే నమ్మవద్దన్నారు. మీరు డిజిటల్ అరెస్ట్ అయ్యారని, నాన్ బెయిలబుల్ కేసు పేరుతో ఎవరైనా బెదిరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అధికారుల పేరు చెప్పి వీడియో కాల్ చేసి మాట్లాడితే స్పందించవద్దని సూచించారు. ఎవరైనా ఓటీపీ, ఖాతా వివరాలు, చెల్లింపుల సమాచారం అడిగితే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. తెలియని బ్యాంక్ ఖాతాలకు ఎలాంటి లావాదేవీలు చేయకుండా, యూపీఐ, ఐఎంపీఎస్, ఆర్టీజీఎస్, ఎన్ఈఎఫ్టీ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎస్ఎంసీ వైద్యుల ఆరోగ్య సర్వే



తొల్కోడు గ్రామంలో సర్వే చేస్తున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల కమ్యునిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు, వైద్యులు బుధవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలోని తొల్కోడులో ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల్లో అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, ఊబకాయం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని గుర్తించి వారికి ఆయా వ్యాధులపై అవగాహన కలిగించారు. అంతేకాకుండా సమయానికి సరైన చికిత్స పొందేలా వివరించారు. ఈ సందర్భంగా కమ్యునిటీ మెడిసిన్ విభాగానికి చెందిన ఇంటర్నల్‌లు, ఫ్యాకల్టీ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ సర్వే చేశారు. ఈ సర్వేలో భాగంగా రక్తపోటు, బరువు, బాడీమాస్ ఇండెక్స్, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు వంటి పరీక్షలు చేశారు. ప్రజల జీవనశైలి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ గోవిందు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ సత్యకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

ముసునూరు: చెక్కపలి హైస్కూల్‌ను బుధవారం ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాలు, టాయిలెట్లు, మంచినీటి సరఫరా ట్యాంకును పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు.

పాడి రైతుకు సన్మానం

ముసునూరు: చెక్కపల్లి పాల సేకరణ కేంద్రానికి ప్రతి రోజూ 100 లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తున్న ఆదర్శ పాడి రైతు కాటేపల్లి కనక దుర్గారావు దంపతులను కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు యూనియన్ అందిస్తున్న సేవలను వివరించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

తిరువూరు: గంపలగూడెం మండలం పెదకొమెరలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తిరువూరు సీఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తుంగారం మండలం టేకుల బంజరకు చెందిన గుగులోతు నరేష్ (అలియాస్ కోడి), గంపలగూడెం మండలం వినగడపకు చెందిన గద్దం రవికిశోర్, తోటమూల సెంటర్‌కు చెందిన వేమిరెడ్డి దుర్గాప్రసాద్ రెడ్డి, దేవభక్తుని ప్రీతమ్ కుమార్ రెండు కిలోల గంజాయితో పట్టుబడ్డాడు. ఒడిశా సరిహద్దుల్లోని విశాఖపట్నం జిల్లా సీలేరు నుంచి నరేష్ గంజాయి తెచ్చి ముగ్గురు యువకులకు విక్రయించారు. దానిని చిన్నచిన్న ప్యాకెట్లలో విక్రయించడానికి వీరు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నలుగురినీ అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరిచామన్నారు. ఎస్ఐ శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ఆగిరిపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ అన్నా. ఆగిరిపల్లిలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి పాఠశాలలో ఉన్న సౌకర్యాలను, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యా సంవత్సరంలో ఇంటింటికీ తిరిగి నూతనంగా 70 అడ్మిషన్లు సాధించిన ప్రధానోపాధ్యాయుడు రెడ్డి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, మక్కే వేణుగోపాలరావు, హర్షవర్ధినిని అభినందించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

జి.కొండూరు: సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి కేసీహెచ్ సూరిబాబు అన్నారు. మండల పరిధి వెల్లటూరు రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం-2005పై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా రైతులు తమకు కావాల్సిన సమాచారాన్ని 30 రోజుల్లో పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ షాపులు తనిఖీ

మైలవరం: రెడ్డిగూడెం గ్రామంలో పెట్రోల్ బంక్, నరుకుళ్లపాడు, కుదప గ్రామాల్లోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను, రెండు మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను, తహసీల్దార్ జె. సుశీల బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ శివ, నాగరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రాజు, యువరాజు, వీఆర్ఓలు ఇమ్మానియేలు, జానీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.